కథ

# పావు గెలిచింది

చావర్తి ఆచార్య



మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ పాత సామెత.

చాలా పాత సామెత.

నేనిప్పుడు కొడుతున్న మందంత పాతది.

మందు కొడుతూ మేరెజెస్ గురించి మాట్లాడుతున్నానంటే నేనెవరో దేవదాసునని ఊహించుకొనేరు. ప్రస్తుతానికి నేను నా మేరేజ్ ఏనివర్సరీ పార్టీలో ఉన్నాను. నా కొలీగ్సందరూ నాలాగానే మునిగి తేల్తున్నారు నా చుట్టూ.

ఐతే నా వెనుక లవ్‌స్టోరీయే లేదని మళ్లీ అపార్థం చేసుకొనేరు. నా చుట్టూ తిరిగిన ప్రేమకథలు కాలేజీరోజుల్లో కావల్సినన్ని... వెన్నెల గురించి ఇప్పుడు మీకు చెప్పి తీరాలి.

సందర్భం అలాంటిది మరి.

వెన్నెల...

అందమైన అమ్మాయా?... ఫర్లేదు. వెన్నెలలాగానే చాలా ఆత్మీయంగా ఉండేది. ఎం.సీ.ఏ. మూడేళ్ల పరిచయమే.... చాలా సన్నిహితమైపోయింది. వాళ్ల కుటుంబంలో నేను సుమారుగా ఓ సభ్యుడినైపోయాను!

ఏం ఖర్మమో గానీ నిజంగానే నా ఆలోచనల్లో తనతో 'ప్రేమ' అనే కాన్సెప్ట్ ఎప్పుడూ చోటు చేసుకోలేదు. తనూ అలాగే ఉండేది. అందుకే నేనలా కలివిడిగా వాళ్లింట్లో తిరగడం వాళ్లమ్మా నాన్నలకు అభ్యంతరమనిపించి ఉండదు.

వెన్నెలకీ నాకూ చదువులో విపరీతమైన పోటీ ఉండేది. వాళ్లింట్లోనే కామన్ లైబ్రరీని మెయిన్‌టెయిన్ చేసి, ఇద్దరమూ కలిసే చదివినా ఎప్పుడూ క్లాస్ ఫస్ట్ నాకే వచ్చేది. తనకొక్కసారి సెకెండ్ ప్లేస్ కూడా దక్కేది కాదు.... ఏడిపించేవాడిని. ఉడుక్కునేదికాదు. సాలోచనగా, చిన్న అడ్మిరేషన్‌తో చూస్తుండిపోయేది.

'ఫ్రెండ్స్! ప్రతి మగవాడి విజయం వెనుక ఓ స్త్రీ వుంటుందన్నది నమ్మి తీరాల్సిన విషయం. సో, హరిగారి వెనుక నిలిచి వెన్ను తట్టిన స్త్రీ మూర్తి గురించి రెండుమాటలు చెప్పమని ఆయన్ని కోరుతున్నాను.' నా కొలీగ్ చేసిన ఇంటరప్షన్‌కి పార్టీలోకొచ్చి పడ్డాను. మైక్ అందుకున్నాను.

'నమస్సులు. ఈ కంపెనీని ప్రారంభించి మూడేళ్లైంది. రెండేళ్లక్రితం ఇదే రోజున నా భార్య లక్ష్మి నా జీవితంలోకి ప్రవేశించింది. నేను సాధించిన విజయాలన్నింటికీ ఆమెకే నేను పట్టం కడతాను...'

నా ప్రసంగం నాకే కృతకంగా

తోస్తోంది. నా విజయాలకి స్త్రీ కారణమా? పరోక్షంగా... కానీ లక్ష్మి మాత్రం ముమ్మాటికీ కాదు. అసలు నేను సాధించిన ఈ స్థితి వెనుక ఉన్నది .... కక్ష.... ప్రతీకారం.... బ్రద్దలైన నా హృదయం.... గాడ్! మందు చాలు... నెత్తికెక్కేసి, సంస్కృతం పలికించేస్తోంది.

000

నిజానికి అలాంటి రోజు నా జీవితంలో ఎదురౌతుందని ఎన్నడూ అనుకోలేదు. నా గుండెని నలిపి, ... తల ఒకేసారి బ్రద్దలైపోయి వుంటే బాగుణ్ణు అనిపించిందా రోజు. నా జీవితాన్ని యు టర్న్ తిప్పి నా ఆలోచనల్నీ, గమ్యాన్నీ ఒక్కసారిగా మార్చేసిన రోజది.

నా విషయంలో ఎం సీ ఏలో జాయిన్ కావటం యాదృచ్ఛికం. అందుకే చదివిన ఆ మూడేళ్లూ 'రేపేంటి' అన్నది నేనెన్నడూ ఆలోచించలేదు. ఎంతో ఆనందంగా గడిచిపోయేవి రోజులు. అప్పుడప్పుడూ క్లాస్‌మేట్స్ సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌ని గురించీ, అమెరికా జీవితాన్ని గురించీ, అంతకు మించిన జీతాల్ని గురించీ మాటాడుతుంటే నేనూ కలలు కనటం అలవరచుకున్నాను- చాలా ఇళ్లు కట్టి, పెళ్లిళ్లు చేసుకున్నాను.

కానీ మా బ్యాచ్ 'ఐరన్ లెగ్' బ్యాచ్‌గా పేరు పడింది. 98 లో మా ఎగ్జామ్స్ పూర్తయ్యాయి. అంతా కలిపి, 'జై సీఎమ్' అని చెప్పి హైటెక్ నగరానికి బయలుదేరేము... ఎండమావి. సరే. సిలికాన్ వేలీ ఆఫిండియా బెంగుళూరు... 'ఎక్స్‌పీరియన్స్ కోలమ్‌లేని రెస్యూమ్ ఇవ్వటం వేస్ట్' అని నేనిచ్చిన బయోడేటాలను గేట్‌మెన్ నా ముందే డస్ట్‌బిన్‌లో వెయ్యడం అద్భుతమైన రిటార్ట్. తలకెక్కిన కిక్ దిగేక మళ్లీ సొంత ఊరు చేరే సరికి మరోసారి ఎమ్ సీయే చదివినట్లైంది.

నేను నా దండయాత్రల తర్వాత నే చదివిన కాలేజీలోనే లెక్చరర్‌గా జాయిన్ అయ్యాను. నాలుగు వేలతో మొదలైన నా జీతం మరో ఏడాదికి నాన్నగారి జీతాన్ని దాటిపోయింది. నా క్లాస్‌మేట్స్‌లో నా తర్వాత కాస్త సెటిల్ అయినవాళ్లు అమ్మాయిలే. పెళ్లి చేసుకుని చక్కగా రూమ్మని ఫ్లైటెక్కేసేరు. కారణమైతే సరిగా తెలీదు, కానీ, ఆ రెండేళ్లలో ఏ సంబంధమూ వెన్నెలకి కుదరలేదు. తను హర్ట్ అవుతుందని నేనూ ఈ విషయం వెన్నెల ముందెపుడూ ప్రస్తావించలేదు. వెన్నెల అమ్మా నాన్నగారూ కూడా ఏమీ చెప్పలేదు.

హఠాత్తుగా ఒకరోజు 'నాకు అమెరికా ఛాన్సొచ్చిందోచ్', అంటూ బాంబ్ పేల్చేసింది వెన్నెల. నిజంగా అది బాంబే. ఇంతవరకూ తనూ నాలాగే స్ట్రగుల్ అయ్యింది కానీ కనీసం నాపాటి లెక్చరర్ పోస్ట్‌ని కూడా సంపాదించలేకపోయింది. నేను రికమండ్ చేస్తే ఓ కాలేజీలో ల్యాబ్ అడ్మినిస్ట్రేటర్‌గా జాయిన్ అయి ఆర్నెల్లు కాలేదింకా.... ఈలోపునే ఇలాంటి న్యూస్.... జీర్ణించుకోలేకపోయాను. ఎలాగైతేనేం, 'కంగ్రాట్యులేషన్స్... హర్టీలీ' అనగలిగేను.

తర్వాత వాళ్లింటికెళ్లి చాలా హడావిడి చేసేను 'పార్టీ ఏ'దంటూ, వెన్నెల అమ్మగారు మాత్రం పోతపోసిన బెంగలాగా కన్పించేరు. 'సంబరాలు చాల్లెండి. ముందు దాని పెళ్లి సంగతి ఆలోచించండి,' అన్నారావిడ విసురుగా, వెన్నెల నాన్నగారినుద్దేశించి.

వెన్నెల తనకేం పట్టనట్లుగా కూర్చుంది.

'ఫర్లేదాంటీ... తన పెళ్లికింకా టైముంది' ఏదో ఒకటనాలి అని అన్నాను. "బాగుంది హరీ! నువ్వూ ఇలా అనేశావ్. దేశం కాని దేశంలో ఒక్కర్తి ఉండటం ఆటలా? నేనేమీ ఈ అవకాశాన్ని వదిలేయమనటం లేదు. వెళ్లేందుకెలానూ కనీసం మూణ్ణెల్ల టైముంది. మనసు పెడితే ఈ లోపు పెళ్లిచేయలేకపోము' అన్నారావిడ.

'మూణ్ణెల్లంటే పెద్ద టైమేమీ కాదు. ఇది పెళ్లి. ఆషామాషీ అనుకున్నావా? సరిగా ఎంక్వయిరీలూ గట్రా చేయకుండా దాన్ని ముక్కూ ముఖం తెలీనివాడికిచ్చి సాగనంపలేం కదా?!' ఆయన ఆర్గ్యుమెంట్.

'ముక్కూ మొహం తెలీకనేం? హరీ! పెద్దదాన్ని. ఇలా అడుగుతున్నానని ఏమనుకోను. మా వెన్నెలని చేసుకోటానికి నీకేమైనా అభ్యంతరమా? మీ పెద్దవాళ్లనే అడగాలి కానీ ముందు నీ అభిప్రాయం చెప్పు. ఇద్దరూ మూడేళ్లు కలిసి చదివేరు. ఒకరంటే ఒకరికి ఆ మాత్రం అభిమానం, అవగాహనా ఉన్నాయి. ఈ రోజు కాదంటే రేపైనా నువ్వూ ఆ అమెరికా వెళ్లకపోవు. మీ అమ్మా నాన్నగారూ మాకు మూడేళ్లనుంచీ చక్కని స్నేహితులు. ఇంకేం కావాలి?'


నా బుర్ర పనిచేయడం మాని చాలాసేపే అయింది. వెన్నెల, వాళ్ల నాన్నగారూ నేనేమంటానా అన్నట్లుగా చూస్తున్నారు.

'నా కభ్యంతరమేంటి ఆంటీ? అసలు వెన్నెల

## కరీన అనుసరణ

ప్రముఖ బాలీవుడ్ విలన్ అమ్రీష్‌పురి పాత్ర కోసం ఓ చిత్రంలో గుండు చేయించుకున్నాడు, మునుపోసారి. కానీ ఆ రూపంతోనే పార్టీలూ, సభలకు హాజరవుతుండేవాడు. ఇప్పుడు నటి కరీనాకపూర్ 'బేవఫా' చిత్రం కోసం తన జుట్టుకు రాగి రంగు వేయించుకుంది. ఆ జుట్టుతో చిత్రంలోని మొదటి ముప్పావు గంట కనిపిస్తుంది. నేను కూడా ఇంకెవరికీ తీసిపోను సుమా! అని చెప్పటం కాబోలు!

ఎన్.



అభిప్రాయం కనుక్కున్నారా?' అన్నాను. ఆంటీ ముఖంలో ఆనందం, అంకుల్ ముఖంలో ఆశ్చర్యం. వెన్నెల మాత్రం లైబ్రరీలో కెళ్లిపోయింది.

ఇది నాకు వండర్‌ఫుల్ ఛాన్స్. వెన్నెల ఒకసారి యు.ఎస్. వెళ్లాలేగానీ, నాకు చాలా సులువుగా అక్కడ జాబ్ దొరికే అవకాశముంటుంది. ఇద్దరి సంపాదన మీద ఒక ఐదేళ్లు మరీ కాదంటే పదేళ్లు కష్టపడితే చాలు. జీవితానికిక ఢోకా ఉండదు. అసలు ఇంతవరకూ వెన్నెలగురించి ఈ కోణంలో నేనెందుకు ఆలోచించలేదో నాకర్థం కావటం లేదు.

తనకూ నాకూ చదువులో స్పర్థ తప్పిస్తే మరే విషయంలోనూ ఇన్నేళ్ల సావాసంలో విభేదాల్లేవు. చాలా సందర్భాల్లో తనే అడ్జస్ట్ అయిపోయేది. నా విషయంలో తనకి ఖచ్చితంగా సాఫ్ట్ కార్నర్ ఉంది.

లైబ్రరీ రూమ్‌లోకెళ్లేను. కూర్చొని ఏదో ఆలోచిస్తోంది. నిశ్శబ్దంగా, వెనుకనుంచీ తన భుజాల చుట్టూ చేతులేసి, 'ఐ లవ్ యూ' అన్నాను చెవిలో గుసగుసగా. నో రెస్పాన్స్... చిన్న తేడా...

.... తిరస్కారం. చప్పున చేతులు తీసేసాను. ఏం మాట్లాడాలో తెలీలేదు. తనే అంది-

'ఎప్పట్నుంచీ నన్ను ప్రేమించడం మొదలెట్టావ్?'

వ్యంగ్యం. 'సూటిగా చెప్పు. నేనంటే నీకిష్టం లేదా?' అన్నాను.

'నా ఇష్టాయిష్టాలెవరికి కావాలి? నీ విషయం చెప్పు. శిరీష ఛీ అందని నా పై ఇష్టం కలిగిందా? లేక ....'

'అసలేం మాటాడుతున్నావో తెలుస్తోందా? నువ్వు... నన్ను అవమానిస్తున్నావ్!'

'నేను అవమానిస్తున్నానా? రెండేళ్లు నీ చుట్టూ తిరిగి, నిన్ను వెనకేసుకొచ్చి- నువ్వు తప్పు చేస్తున్నా నేను నిన్ను వెనకేసుకొస్తే నన్నెందుకు ప్రేమించలేకపోయావ్? నిన్నటికి లేని ప్రేమ ఇప్పుడెందుకు సడెన్‌గా పుట్టింది?'

'అంటే నువ్వు యు.ఎస్. వెళ్తావని నేనీ పెళ్లికొప్పుకున్నానంటావా?'

'కాదా? కొంచెం నిజాయితీగా మాటాడు. నిన్నటివరకూ నేనో ల్యాబ్ అడ్మినిస్ట్రేటర్‌ని. అది కూడా, నీ రికమండేషన్‌తో సంపాదించుకున్న 3 వేల జీతం. నీ సంపాదనలో నాలుగోవంతుకూడా కాదు. నీతో పోటీపడి కూడా ఎన్నడూ నిన్ను గెలవలేనిదాన్ని. ఓ సాధారణమైన మధ్యతరగతి అమ్మాయిని...'

'వెన్నెలా నేనెప్పుడూ అలా ఆలోచించలేదు,' నా వ్యక్తిత్వాన్ని శవం కాదని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. నిజానికి వెన్నెల అన్నట్టు శిరీష ఛీ కొట్టినప్పుడు.... నో, తిరస్కరించినప్పుడు నేనింతగా కదిలిపోలేదు.

'మరింతగా నిన్ను నువ్వు నా దృష్టిలో దిగజార్చుకోకు...ప్లీజ్' చేతులు జోడించి ఏడ్చేసింది. 'చెప్పు. శిరీష వెంటెందుకు పడ్డావు? తను అందమైంది. డబ్బుంది. తనూ నీలాంటిదే. నీ కంటే గొప్పవాణ్ణి చూసుకొని ఫ్లైటెక్కేసింది. ఇప్పుడు శిరీష స్థానంలో నన్ను నిలబెడుతున్నావు నువ్వు. అసలిదంతా నాకనవసరం. నీమీద నాకు నమ్మకం లేదు. నా గురించి నువ్వెలా ఆలోచించావో, నేనూ అలాగనే ఆలోచిస్తాను.'

నేను మాట్లాడలేదు. మాట్లాడ్డానికి అసహ్యంగా వుంది. వెన్నెలవైపు చూడటానికే నా మనస్సొప్పటం లేదు. తనే అంది-

'ఇప్పుడు చెబుతున్నాను. నువ్వెన్నటికీ సక్సీడ్ కాలేవు. నిన్నటివరకూ నేను మూడువేల ఉద్యోగినే. ఇప్పుడు నీ జీతం నా యు.ఎస్. ఆఫర్‌లో పదో వంతు... ఐ బెట్...'

'నీకు పిచ్చి పట్టింది. డబ్బు పిచ్చి' నా గొంతు నాకే వినపడటం లేదు.

'లేదు హరీ! ఎవరమూ పిచ్చివాళ్లం కాము. తెలివైన వాళ్లం. అతి తెలివైన వ్యాపారస్తులం. సూత్రధారివి నువ్వే. నీ ఫార్ములా ప్రకారం వ్యక్తికంటే ఆ వ్యక్తి హోదా, అంతస్తు ముఖ్యం. కరెక్టే. అప్పుడే కదా మనిషి ఎదిగేది?! నేనూ ఇప్పుడలానే ఆలోచించాలి. నా లైఫ్ పార్టనర్ కాకినాడలో ఓ లెక్చరర్ కాకుండా యు.ఎస్. లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయితే బాగుంటుంది. ప్రస్తుత పరిస్థితిలో మరో పదేళ్లయినా నువ్వలా అవుతావని నాకన్పించట్లేదు.'

నేనింక వినదలుచుకోలేదు. 'అంకుల్‌ని మా ఇంటికి రావొద్దని చెప్పేయ్. 'బై' అనేసి ఇంటికొచ్చేశాను. మరుసటి నెలలోనే ఒక యు.ఎస్. సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో వెన్నెలకి పెళ్లైంది. ఆ పెళ్లి వల్ల మా రెండు కుటుంబాలూ శత్రువులైతే కాలేదు కానీ అపరిచితులమైపోయాం.

000

చుట్టూ చూశాను. మందు మహాత్మ్యం తెలిసొస్తోంది. తింటున్నవాళ్లు, తాగుతున్నవాళ్లు, తూల్తున్నవాళ్లు నా చుట్టూ రయ్‌మని పరిభ్రమిస్తున్నారు. పరకాయించి చూస్తే... ఓ మూల టేబుల్ దగ్గర..... విస్కీ గ్లాస్‌ని గ్లోబుని చూసినట్టు పరిశీలిస్తూ... ఒంటరిగా... వెన్నెల నాన్నగారు!

చాలా జాలేసింది. వెన్నెల వల్ల మా ఫ్యామిలీతో వచ్చిన ఎడబాటు ఆయన్ని చాలా బాధపెట్టింది. ఇన్నాళ్లకి ఆయన్ని చూడటం నాకు చాలా ఆనందంగా వుంది నాకు. కానీ, ఆయన్ని చూసేకొద్దీ వెన్నెల మీదున్న కసి పొంగుకొస్తోంది. ఆయన ముందు కూలబడ్డాను.

నన్ను పరిశీలనగా చూస్తూ ' చాలా మారేవు హరీ!' అన్నారాయన.


నవ్వేను. 'మందు సంగతేనా?.... నాకిదెందుకు అలవాటైందో మీకు మాత్రం తెలీదా?'

ఆయన వేదాంతిలా చిరునవ్వు ఒకటి పడేశారు.

'వెన్నెల నన్ను హర్ట్ చేసిందంకుల్...' ఇంకేదో చెప్పబోయాను.

'నాకు తెల్సు.'

'చూడండి...' గోడపైనున్న మా కంపెనీ ప్రోగ్రెస్ ఛార్ట్ చూపించాను.



## మిర్చి వల్ల నష్టమే!

వంటకాల్లో కారం బాగా వేసుకుని తినేవారికి ఇదే హెచ్చరిక. మసాలాలతో పాటు మిరపకాయలూ బాగా తినేవారికి కంఠం, ఉదరం వంటి చోట్ల మంట పుడుతుంటుంది. దీని వల్ల నాలుక మీదున్న టేస్ట్ బడ్స్ (రుచి తెలిపే బొడిపెలు) పని చేయటం తగ్గుతుందట. అంతే కాదు, కారంతో పాటు తీసుకునే పదార్థాల్లోని ఇతరవాసనలు కూడా ముక్కుకు సరిగ్గా తగలనీయకుండా అవుతుందట. కనుక మిర్చితో జాగ్రత్త సుమా!

ఎన్.

'ఇదే... నేను పదేళ్లైనా సాధించలేనూ అని వెన్నెల ఎద్దేవా చేసినది... ఇదే! చూసేరా? జస్ట్ నాలుగేళ్లలో చేసి చూపెట్టేను. నిజంగా చెప్పండంకుల్... ఇది నేను చేయగలనని తనకి తెలీదూ?'

'తెలుసు. ఈ విషయం తనకి ముందే తెల్సు. ఈ విషయం వెన్నెలతో తగవు పడినరోజు రాత్రే నాకు చెప్పింది.'

'అవును. తను తెలివైంది. అతి తెలివైంది.' కసిగా అన్నాను.

'లేదు. మీరిద్దరూ తెలివైనవాళ్లే... ఒకేలాంటివాళ్లు... మూర్ఖులు... నన్ను చెప్పనియ్యి. మీ తగవులో నీ తప్పులేదంటావా? నీవల్ల తనే ముందు హర్ట్ అయింది. తన మాటలకి నొచ్చుకొని ఈ నాలుగేళ్లు ఎంత కష్టపడ్డావో, శిరీష విషయంలో నువ్వు చేసిన పనికి హర్ట్ అయి, వెన్నెల కూడా అలానే కష్టించింది. ఎంతోమంది కన్సల్టెంట్‌లని కలిసింది. ఎలాగైనా నీ దృష్టిలో తను నీకే అందనంత గొప్పది కావాలనుకుంది... సాధించింది. ఈ ప్రోసెస్‌లో తన ఎంప్లాయర్ మాకు తెలిసినవాడేలే మ్యారేజ్ ప్రపోజల్ తెచ్చేడట. వెన్నెలకూడ ఓకే అనేసిందిట. దురదృష్టవశాత్తూ ఈ విషయం మాతో చెప్పేలోపున నీతో వెన్నెల పెళ్లిని గురించి డైరెక్ట్‌గా ఆంటీ నిన్ను అడిగేసింది. దాంతో వెన్నెల బ్రేక్ అయిపోయింది... ఆ అసహాయతలో నిన్ను హర్ట్ చేసింది....'

'ఔను. చాలా హర్ట్ చేసింది... అసలు...'

'షటప్ ప్లీజ్.... ఆ రోజు నువ్వెళ్లాక తిట్టేను... తిట్టటమేంటి? కొట్టేను కూడా' చేతులవంక చూసుకుంటున్న అంకుల్ కళ్లల్లో నీళ్లు.

'భోరున ఏడ్చేసింది. నా కాళ్లమీద పడి ఏడ్చేసింది. జరిగిందంతా చెప్పింది ఇంకో విషయం కూడా అపుడే చెప్పింది. మీ ఇద్దరి పెళ్లీ గనక జరిగితే నువ్వెన్నటికీ బాగుపడవంది. నీ కలా అన్పించట్లేదా?'

'ట్రాష్'.

'నీ విషయం అలా ఉంచు. తనైనా నువ్వు చేసినదానిని మరిచిపోయి, నీతో జీవితాన్నెలా గడిపేస్తుంది? నువ్వు ఒప్పుకున్నా లేకున్నా, నువ్వింతటి విజయాన్ని మాత్రం సాధించగలిగే వాడివి కాదు. ఇది వెన్నెల ఆ రోజే చెబుతుంటే ఇమ్మెచ్యూర్‌గా ఆలోచిస్తున్నావంటూ తిట్టేను. ఇప్పుడు నిన్నిలా చూస్తుంటే మాత్రం తన అంచనాలు ఎంత ప్రాక్టికల్‌గా, కాలిక్యులేటెడ్‌గా ఉన్నాయో తెలుస్తోంది. నీపై తనకెంత నమ్మకమో, ఆ నమ్మకం కూడా ఎంత పర్‌ఫెక్ట్‌గా, రియలిస్టిక్‌గా ఉందో అర్థమౌతోంది. రియల్లీ, అయామ్ ప్రౌడాఫ్ హర్...'

నాకు చాలా ఇబ్బందిగా, అసహనంగా వుంది. వెన్నెలపై నేను ఇప్పుడే పగ తీర్చుకున్నాను. కానీ ఓడిపోయేననిపిస్తోంది. నా గెలుపుని నానుంచి లాగేసుకుని, ఓటమిని అంటగట్టి, వెన్నెల వెక్కిరిస్తోంది అనిపిస్తోంది.

'....ష్ డిసీవ్డ్ మీ' దాదాపు అరిచినంత పనిజేశాను.

■




## విజ్ఞాన, వినోద, వికాసాల మేలు కలయిక




సరికొత్త సింగారాలతో, సంచలన వ్యాసాలతో
ప్రతి ఆదివారం ఆంధ్రప్రభ అనుబంధంగా
మీకోసం వస్తోంది 'ఆదిత్యహృదయం'

**రాజకీయ'చెద'రంగంపై అక్షర నారాచాలు**
సమకాలీన అంశాలపై ఆలోచనాత్మక వ్యాసాలు
సాహిత్యరంగంలో తులనాత్మక విశ్లేషణలు
**వినోద ప్రపంచంలో వింతల పాలపుంతలు**
విద్య, వైజ్ఞానికరంగాల్లోని విశేషాల రసగుళికలు
సినిమారంగంపై గరంగరం సమాలోచనలు



**ఇరవై పేజీల అపురూప సమాచారం**

# ఆదివారం ఆంధ్రప్రభ దినపత్రికతో ప్రతివారం

ఆంధ్రప్రభ చదవటం మీ ఉత్తమాభిరుచికి నిదర్శనం!